E69 NEWS


# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు   జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: HYDERABAD, JANGAON   సంపుటి :01   సంచిక :67   శనివారం 08 ఆగస్టు 2026   ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్   పేజీలు: 04   వెల :05/-

## వందేమాతరం ఇక జాతీయ గీతమే




2 లో

- వందేమాతరానికి రాష్ట్రపతి ఆమోదముద్ర
- చట్టరూపం దాల్చిన కీలక బిల్లు
- అవమానిస్తే కఠిన చర్యలు తప్పవు
- ప్రభుత్వ కార్యక్రమాల్లో గౌరవం తప్పనిసరి
- వందేమాతరం ఆలాపనకు కొత్త నిబంధనలు
- దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

## సునేత్రా-పీకే భేటీ కలకలం

- కూటమి ధర్మం పాటించాలి
- బీజేపీ నుంచి గట్టి హెచ్చరిక
- మహాయుతిలో చీలిక భయమా?
- పార్టీ బలోపేతంపై పీకే సలహాలు
- భేటీపై రాజకీయ చర్చ
- మహారాష్ట్ర రాజకీయాల్లో కొత్త మలుపు



2 లో

**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (తెలుగు గళం):** బిహార్‌లోని బంకీపూర్ ఉప-ఎన్నికల్లో విజయం సాధించిన ప్రశాంత్ కిషోర్‌తో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం , నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సునేత్రా పవార్ భేటీ రాజకీయ వర్గాల్లో చర్చ రేపుతోంది. ఈ నేపథ్యంలో మహాయుతి కూటమికి ముప్పు తెచ్చే పనులు చేయొద్దని సునేత్రాకు మహారాష్ట్ర బీజేపీ మంత్రి చంద్రశేఖర్ బవాన్కులే హితవు పలికారు. 'కూటమిలో చీలిక తెచ్చే ఏ నిర్ణయాన్ని తీసుకోవద్దు' అని మరాఠా రెవెన్యు మంత్రి సూచించారు. "ఇది వాళ్ల పార్టీ అంతర్గత వ్యవహారం. అయితే, మహాయుతి కూటమిలో ఉంటూ.. భాగస్వామ్య పక్షాలలో అనుమానాలు రేకెత్తించేలా లేదా ఏ పార్టీకైనా నష్టం కలిగించేలా ప్రవర్తించకూడదు.. అందరూ కూటమి ధర్మాన్ని పాటించాల్సిందే" అని ఆయన స్పష్టం చేశారు.


**పీకేతో భేటీకి కారణం ఏంటి?**

ప్రస్తుతం మహారాష్ట్ర మహాయుతి సర్కారులో బీజేపీతో పాటు సునేత్రా పవార్ నాయకత్వంలోని ఎన్సీపీ, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన కూటమి భాగస్వామ్య పక్షాలుగా ఉన్నాయి. "ఆమె ప్రశాంత్ కిశోర్‌ను ఎందుకు కలిశారనే దానిపై నేను ఎక్కువగా మాట్లాడను..కానీ కూటమిలో అపనమ్మకం లేదా మనస్పర్ధలు కలిగించేలా ఎవరూ ప్రవర్తించరాదు" అని మంత్రి చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు.

దక్షిణ ముంబయిలోని తన అధికారిక నివాసం 'దేవ్‌గిరి'లో ప్రశాంత్ కిషోర్‌తో సునేత్రా పవార్ భేటీ అయినట్టు ఎన్సీపీ నేత సంజయ్ ఖోడ్కే ధ్రువీకరించారు.

## 'మెటా'కు దెబ్బమీదదెబ్బ

- మెటాపై రూ.7,800 కోట్ల భారీ జరిమానా
- పిల్లల భద్రత నిర్లక్ష్యమే కోర్టు ఆగ్రహం
- టీనేజర్ల మానసిక ఆరోగ్యానికి నష్టం ఆరోపణలు
- బాధిత యువత చికిత్సకు జరిమానా నిధులు
- కోర్టు తీర్పుపై పైకోర్టుకు మెటా అప్పీల్



## ఉగ్రకుట్ర కేసులో ప్రకంపనలు

- జంతర్‌మంతర్ కేసుతో బదిలీ
- అమృత్‌సర్ సీపీకి ట్రాన్స్‌ఫర్
- వ్యాఖ్యలపై రాజకీయ దుమారం
- బీజేపీ అనుమానాలకు బలం?
- ప్రభుత్వం స్పష్టీకరణ విడుదల
- బదిలీపై కొత్త వివాదం



**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (తెలుగు గళం):** జంతర్ మంతర్ నిరసనలపై అమృత్‌సర్ పోలీస్ కమిషనర్ గుర్‌ప్రీత్ సింగ్ భుల్లార్ చేసిన వ్యాఖ్యలు పంజాబ్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇప్పుడు భుల్లాన్‌ను ఆమ్ ఆద్మీ పార్టీ సర్కార్ బదిలీ చేసింది. దీనిపై బీజేపీ ప్రశ్నల్ని లేవనెత్తింది. కొద్దిరోజుల క్రితం అమృత్‌సర్ పోలీసులు పాకిస్తాన్ ఐఎస్ఐ మద్దతుతో పనిచేస్తున్న ఉగ్రవాద మాడ్యుళ్లపై కీలక ఆపరేషన్ నిర్వహించారు.

2 లో

## ఉగ్ర ప్రచురణలకు మహారాష్ట్ర చెక్

- 114 తీవ్రవాద ప్రచురణలపై మహారాష్ట్ర నిషేధం
- ఉగ్ర భావజాల ప్రచారంపై ప్రభుత్వ కఠిన చర్యలు
- అధికారిక గెజిట్‌తో నిషేధ ఉత్తర్వులు జారీ
- యువతను రెచ్చగొట్టే ప్రచారానికి చెక్
- ముద్రణ, పంపిణీదారులపై చట్టపరమైన చర్యలు
- దేశ భద్రత దృష్ట్యా కీలక నిర్ణయం
- ఉగ్రవాద అనుబంధ ప్రచురణలపై ఉక్కుపాదం

2 లో

## ఎస్సీ, ఎస్టీలకు యథాతథ రిజర్వేషన్లు

- ఎస్సీ, ఎస్టీలకు క్రీమిలేయర్ వర్తించదన్న కేంద్రం
- సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్ దాఖలు
- ఓబీసీ విధానం ఎస్సీ, ఎస్టీలకు కాదని స్పష్టం
- సామాజిక వెనుకబాటుతనం భిన్నమన్న కేంద్రం
- రాజ్యాంగ హక్కుల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం
- పిటిషన్లను కొట్టివేయాలని కేంద్రం విజ్ఞప్తి
- రిజర్వేషన్లపై కేంద్రం కీలక వైఖరి వెల్లడింపు

2 లో

# దస్తావేజులు నకిలీ దందా అసలైనది!




- ఎన్వోసీ మాఫియా బట్టబయలు!
- ఫైర్ సేఫ్టీ పేరుతో భారీ దగా
- కాలేజీలకు ఫేక్ అనుమతుల వరద
- ఇంటర్ బోర్డులో అవినీతి కలకలం
- ముడుపులతో నడిచిన అఫిలియేషన్లు
- భద్రతను పణంగా పెట్టిన కాలేజీలు
- నకిలీ ఎన్వోసీలపై సర్కార్ సీరియస్
- అధికారులపై విచారణకు రంగం సిద్ధం
- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (తెలుగు గళం):** రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్ కాలేజీల అనుమతులు, ఫైర్ ఎన్వోసీల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మొదట చిన్నదిగా కనిపించినా ఈ బోగస్ సర్టిఫికెట్ల వ్యవహారం చినికిచినికి గాలివానలా మారి మొత్తం ఇంటర్ మీడియట్ బోర్డునే చుట్టుముడుతున్నది. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతూ సాగిన ఈ దందా, అధికారుల లంచాల వాటాల్లో తేడాలు రావడంతోనే రచ్చకెక్కింది. ఐదారేళ్లుగా కనీస నిబంధనలు పాటించని, కమర్షియల్ బిల్డింగ్ లో నడుస్తున్న కాలేజీలకు అధికారులు అనుమతిస్తూ వచ్చారు. అలాంటి కాలేజీలే ఇప్పుడు ముడుపులు ముట్టజెప్పి నకిలీ ఎన్ఓసీలు సమర్పించాయని తెలుస్తున్నది. ఫైర్ ఎన్వోసీల వ్యవహారం క్యూర్ పరిధిలోని డీఐఈఓలు, ఇంటర్ బోర్డులోని ముగ్గురు అధికారులకు తెలిసే కొన్నేళ్లుగా కొనసాగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మిగతాది 2 లో..

## చాందీపూర వైరస్‌తో దేశంలో కలకలం

- 22 మంది చిన్నారులు బలి
- మరో ఏడుగురి పరిస్థితి విషమం
- సాండ్‌ఫ్లై ద్వారా వైరస్ వ్యాప్తి
- కేంద్ర బృందం రంగంలోకి
- గుజరాత్‌లో హెల్త్ అలర్ట్



2 లో

**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (తెలుగు గళం):** గుజరాత్‌లో 'చాందీపూర' వైరస్ కలకలం రేపుతోంది. ఈ ప్రాణాంతక వైరస్ బారిన పడి ఇప్పటివరకు ఏకంగా 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ విషయాన్ని గుజరాత్ ఆరోగ్య శాఖ మంత్రి ప్రఫుల్ పన్సేరియా అధికారికంగా ధృవీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 184 అనుమానిత కేసులు నమోదు కాగా, అందులో 35 మందికి వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది.

## త్వరలో డిజిటల్ అసెంబ్లీ ప్రారంభం

- పేపర్‌లెస్ పాలనకు శ్రీకారం
- 80 లక్షల ఇళ్లకు టీ-ఫైబర్
- ఏఐతో ప్రభుత్వ సేవల విస్తరణ
- రియల్‌టైమ్ గవర్నెన్స్ డ్యాష్‌బోర్డ్
- డిజిటల్ తెలంగాణ దిశగా అడుగులు



**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (తెలుగు గళం):** రాష్ట్రంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పాలనను మరింత వేగవంతం, పారదర్శకం చేసేందుకు ప్రభుత్వం అనేక విప్లవాత్మక డిజిటల్ కార్యక్రమాలను చేపడుతోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శాసనసభ, మండలి వ్యవహారాలను సంపూర్ణంగా డిజిటలైజ్ చేస్తూ త్వరలోనే డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. GOVconnect, ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ (మీసేవ) సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన "ఏఐ ట్రాన్స్‌ఫార్మేషన్ కాంక్లేవ్ (తెలంగాణ)"ను ప్రారంభించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి ప్రసంగించారు. డిజిటల్ ఆఫీస్ ప్రాజెక్ట్ ద్వారా ప్రభుత్వ శాఖల్లో పేపర్ లెస్ పాలనకు పెద్దపీట వేస్తున్నామని, నకిలీ పత్రాలకు తావులేకుండా భద్రమైన బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల సేవలను త్వరలో అందుబాటులోకి తేనున్నట్లు ప్రకటించారు.

2 లో


## నాగార్జునసాగర్‌లో వరుణ యాగం



2 లో

- ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లో వరుణ యాగం
- రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్ష
- యాదగిరిగుట్ట వేద పండితులతో శాస్త్రోక్త నిర్వహణ
- యాగ ఏర్పాట్లను సమీక్షిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్


## చంద్రుణ్ణి ఢీకొట్టిన స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ రాకెట్



2 లో

- గంటకు 8,700 కిలోమీటర్ల వేగంతో ఢీకొట్టు
- చంద్రుడిపై కొత్త భారీ క్రేటర్ ఏర్పాటైంది
- ఢీకొన్న ప్రాంతాన్ని చిత్రీకరించిన డానురి ఆర్బిటర్
- సోడియం, లిథియం వాయువుల ఆనవాళ్లు గుర్తింపు
- భూమికి ఎలాంటి ప్రమాదం లేదన్న శాస్త్రవేత్తలు
- అంతరిక్ష పరిశోధకులను ఆకట్టుకున్న అరుదైన ఘటన

## వందేమాతరం ఇక జాతీయ గీతమే




**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (తెలుగు గళం):** భారత స్వాతంత్ర్య పోరాటంలో కోట్లాది మందిలో దేశభక్తి రగిలించిన అమర గీతం వందేమాతరం కు అత్యున్నత గౌరవం దక్కింది. వందేమాతరం గీతానికి జాతీయ గీతం తో సమానమైన అధికారిక హోదాను కల్పిస్తూ రూపొందించిన నూతన చట్టానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. రాష్ట్రపతి అంగీకారంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చింది.

ఇకపై వందేమాతరం గీతాన్ని ఎవరైనా అడ్డుకున్నా, బహిరంగంగా అవమానించినా లేదా హేళన చేసినా దాన్ని చట్టరీత్యా తీవ్రమైన నేరంగా పరిగణించనున్నారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యక్రమాలు, బహిరంగ సభల్లో వందేమాతరం గీతాలాపన జరుగుతున్న సమయంలో గేయానికి విఘాతం కలిగించినా, అసౌకర్యం కలిగించినా చట్టప్రకారం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. 'జన గణ మన' మాదిరిగానే వందేమాతరం ఆలాపన సమయంలో ప్రదర్శించాల్సిన ప్రాథమిక క్రమశిక్షణ, గౌరవ నియామకాలు ఈ చట్టం ద్వారా అమలులోకి రానున్నాయి. దేశ చారిత్రక ప్రాధాన్యతను, జాతీయ భావాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టానికి దేశ ప్రథమ పౌరరాలు, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం లభించడం పట్ల దేశప్రజలకు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 'మెటా'కు దెబ్బమీద దెబ్బ..



**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (తెలుగు గళం):** సోషల్ మీడియా దిగ్గజం మెటా కు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతుతున్నాయి. తాజాగా సోషల్ మీడియా వేదికలపై పిల్లలు, టీనేజర్ల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించడంతో పాటు వారి భద్రతను నిర్లక్ష్యం చేసినందుకుగానూ మెటాకు 567 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.4,700 కోట్లకు పైగా భారీ జరిమానా విధిస్తూ న్యూ మెక్సికో కోర్టు చారిత్రాత్మక తీర్పును వెలువరించింది.

రెండు దశల సుదీర్ఘ విచారణ..

న్యూ మెక్సికో అటార్నీ జనరల్ రౌల్ టోరెజ్ దాఖలు చేసిన ఈ కేసు విచారణ రెండు దశల్లో సాగింది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లు పిల్లల మానసిక ఆరోగ్యానికి కలిగించే ప్రమాదాలను దాచిపెట్టి, వినియోగదారులను మోసం చేశాయని నిర్ధారిస్తూ మార్చి నెలలోనే జ్యూరీ మెటాపై 375 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.3,100 కోట్ల జరిమానా విధించింది. తాజాగా న్యాయమూర్తి బ్రయాన్ బీడ్‌షీడ్ ఇచ్చిన ఉత్తర్వులతో అదనంగా మరో 567 మిలియన్ డాలర్లు చెల్లించాలని ఆదేశించడంతో, ఈ ఒక్క కేసులోనే మెటా చెల్లించాల్సిన మొత్తం జరిమానా 942 మిలియన్ డాలర్లకు అంటే మన కరెన్సీలో రూ.7,800 కోట్లు చేరింది. కోర్టు ఆదేశాల ప్రకారం, ఆ జరిమానా సొమ్ములో 420 మిలియన్ డాలర్లు సోషల్ మీడియా అడిక్షన్, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న యువత చికిత్స నిమిత్తం ఉపయోగించనున్నారు.

పైకోర్టుకు వెళ్తాం.. 'మెటా'

అయితే, మెక్సికో కోర్టు తీర్పుపై 'మెటా' ప్రతినిధులు స్పించారు. తమ ప్లాట్‌ఫారమ్‌లలో టీనేజర్ల భద్రతకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, నిబంధనలను నిరంతరం మెరుగుపరుస్తున్నామని తెలిపారు. అయితే, కోర్టు ఇచ్చిన సదురు ఉత్తర్వులపై పైకోర్టులో అప్పీలు చేస్తామని వారు స్పష్టం చేశారు.

## ఎస్సీ, ఎస్టీలకు యథాతథ రిజర్వేషన్లు



**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (తెలుగు గళం):** ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు క్రీమిలేయర్ సూత్రాన్ని వర్తింపజేయలేమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. ఓబీసీ విభాగంలో అమలవుతున్న ఈ విధానాన్ని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కూడా విస్తరించాలని దాఖలైన పిటిషన్లపై కేంద్రం తాజాగా అఫిడవిట్ దాఖలు చేసింది. ఓబీసీలలో ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా మెరుగైన స్థితిలో ఉన్న వారిని గుర్తించి రిజర్వేషన్ ప్రయోజనాల నుంచి మినహాయించడానికి క్రీమిలేయర్ విధానాన్ని ఉపయోగిస్తున్నారు. అయితే, ఇదే సూత్రాన్ని ఎస్సీ, ఎస్టీలకు వర్తింపజేయాలని కోరుతూ వచ్చిన పిటిషన్లను తోసిపుచ్చాలని కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానాన్ని ఆమోదయోగ్యమైన వాదనలతో కోరింది.

ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఎదుర్కొంటున్న సామాజిక వివక్ష, వెనుకబాటు తనం స్వభావం ఓబీసీలతో పోలిస్తే భిన్నమైనవని, కాబట్టి వారి రిజర్వేషన్లలో క్రీమిలేయర్ పరిమితి విధించడం సరికాదని కేంద్రం తరపున సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీల రాజ్యాంగ బద్ధమైన హక్కులు, వారి సామాజిక సాధికారతను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమిలేయర్‌ను అమల్లోకి తీసుకురావాలంటూ దాఖలైన పిటిషన్లను కొట్టివేయాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు కు విజ్ఞప్తి చేసింది.

## చాందీపూర వైరస్‌తో దేశంలో కలకలం




**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (తెలుగు గళం):** గుజరాత్‌లో 'చాందీపూర' వైరస్ కలకలం రేపుతోంది. ఈ ప్రాణాంతక వైరస్ బారిన పడి ఇప్పటివరకు ఏకంగా 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ విషయాన్ని గుజరాత్ ఆరోగ్య శాఖ మంత్రి ప్రఫుల్ పన్సేరియా అధికారికంగా ధృవీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 184 అనుమానిత కేసులు నమోదు కాగా, అందులో 35 మందికి వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. మరణించిన వారందరూ 15 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పిల్లలే కావడం గమనార్హం. ప్రస్తుతం మరో 7 మంది చిన్నారులు ఆసుపత్రుల్లో తీవ్ర ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. ఈ కేసులు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి నమోదువుతున్నట్లు అధికారులు తెలిపారు.

చాందీపూర అనేది ప్రధానంగా 'సాండ్‌ఫ్లై' (ఇసుక ఈగలు) కుట్టడం ద్వారా వ్యాపించే తీవ్రమైన వైరల్ ఇన్ఫెక్షన్. ఈ వైరస్ బారిన పడిన వారిలో తీవ్రమైన జ్వరం, తలనొప్పి, వాంతులు, మూర్ఛ వంటి లక్షణాలు కనిపిస్తాయి. పరిస్థితి విషమిస్తే ఇది అత్యంత వేగంగా 'ఎన్‌సెఫలైటిస్'కి దారితీస్తుంది. పిల్లల్లో ఈ వ్యాధి మరణాల రేటు ఏకంగా 55% నుండి 77% వరకు చాలా ఎక్కువగా ఉంటుంది. ఇప్పటివరకు ఈ వైరస్‌ను నయం చేయడానికి నిర్దిష్టమైన వ్యాక్సిన్ గానీ, ప్రత్యేకమైన మందులు గానీ అందుబాటులో లేవు.

పరిస్థితి తీవ్రతను దృష్ట్యా గుజరాత్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా హెల్త్ సర్వైలెన్స్ పెంచింది. సాండ్‌ఫ్లైల నివారణకు గ్రామాల్లో, పట్టణాల్లో క్రిమిసంహారక స్ప్రేలు చల్లుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా రంగంలోకి దిగి పరిస్థితిని సమీక్షించడానికి 'నేషనల్ జాయింట్ రెస్పాన్స్ టీమ్'ను గుజరాత్‌కు పంపించింది. పిల్లల్లో జ్వరం లేదా మెదడు వాపు లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించి అత్యవసర వైద్య సహాయం అందించాలని అధికారులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఉగ్ర ప్రచురణలకు మహారాష్ట్ర చెక్




**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (తెలుగు గళం):** వివిధ నిషేధిత ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కలిగి, దేశ భద్రతకు విఘాతం కలిగిస్తున్నాయనే ఆరోపణలతో 114 తీవ్రవాద ప్రచురణలు, పత్రికలు, పత్రాలపై మహారాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి నిషేధం విధించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. దేశంలో యువతను తీవ్రవాదం వైపు ఆకర్షించడం, మత విద్వేషాలను రెచ్చగొట్టడం, ఉగ్రవాద భావజాలాన్ని ప్రచారం చేయడమే లక్ష్యంగా ఈ పత్రికలు పనిచేస్తున్నట్లు విచారణలో తేలడంతో ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.

నిషేధానికి గురైన ప్రచురణల జాబితాలో 'వాయిస్ ఆఫ్ ఖురాసన్ మ్యాగజైన్', 'ది రివాల్యూషనరీ రిసర్జెన్స్', 'కాశ్మీర్ కిఫా – రెసిలియన్స్ ఢ కరేజ్', 'ది సోల్ ఆఫ్ రెసిస్టెన్స్', అలాగే 'నవాయ్ గజ్వా–ఎ–హింద్' వంటి కీలక పత్రికలు ఉన్నాయని గెజిట్ నోటిఫికేషన్ ద్వారా స్పష్టమవుతోంది. ఇవన్నీ విదేశీ అలాగే దేశీయ ఉగ్రవాద సంస్థలతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలు కలిగి ఉన్నాయని ప్రభుత్వం గుర్తించింది. ఈ పత్రికల ముద్రణ, పంపిణీ, డిజిటల్ ప్రచారంలో పాల్గొనే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.

## నాగార్జునసాగర్‌లో వరుణ యాగం

**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (తెలుగు గళం):** రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసి, ప్రాజెక్టులు అన్నీ జలకళను సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం భారీ ఎత్తున వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించింది. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన, ఆదేశాల మేరకు ఈ విశిష్ట ఆధ్యాత్మిక క్రతువుకు శ్రీకారం చుట్టారు. యాగ ముహూర్తం, ప్రాంగణం యాదగిరిగుట్ట దేవస్థానం ప్రధాన అర్చకులు, వేద పండితులు, సిద్ధాంతి వరుణ యాగానికి ఆగస్ట్ 10న శుభ ముహూర్తంగా ఖరారు చేశారు. నల్గొండ జిల్లాలోని ప్రసిద్ధ నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలో ఉన్న 'విజయవిహార్' ప్రాంగణం యాగ నిర్వహణకు వేదిక కానుంది.

రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో, యాదగిరిగుట్ట క్షేత్ర వేద పండితులు శాస్త్రోక్తంగా, వైదికాచారాల ప్రకారం వరుణ యాగాన్ని జరగనుంది. కృష్ణా, గోదావరి నదుల్లోకి భారీగా వరద వెల్లువెత్తాలని, చెరువులు, కుంటలు నిండి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రాష్ట్ర ప్రజలందరూ సస్యశ్యామలంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు. వరుణ యాగానికి సంబంధించి ఏర్పాట్లను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షిస్తున్నారు.

## చంద్రుణ్ణి ఢీకొట్టిన స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ రాకెట్



**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (తెలుగు గళం):** అంతరిక్షంలో ఒక ఆసక్తికరమైన ఉదంతం చోటుచేసుకుంది. ఆగస్టు 5న స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన 'ఫాల్కన్–9' రాకెట్ చంద్రుడి ఉపరితలాన్ని అత్యంత వేగంతో ఢీకొట్టింది. అంతరిక్ష పరిశోధనా సంస్థల వివరాల ప్రకారం.. ఈ రాకెట్ భాగాన్ని 2025 జనవరి 15న ప్రయోగించారు. ఆ సమయంలో ఇది 'ఫైర్‌ఫ్లై ఏరోస్పేస్ బ్లూ ఘోస్ట్' వంటి చంద్ర ల్యాండర్లను సురక్షితంగా అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. మిషన్ పూర్తయిన తర్వాత ఈ రాకెట్ అప్పర్ స్టేజ్ అంతరిక్షంలోనే వ్యర్థంగా మిగిలిపోగా, సూర్యకాంతి, వివిధ గ్రహాల గురుత్వాకర్షణ శక్తుల ప్రభావం వల్ల దీని కక్ష్య మారి క్రమంగా చంద్రుడి వైపు పయనించింది.

సుమారు 4 టన్నుల బరువున్న ఈ వ్యోమ నౌక భాగం గంటకు ఏకంగా 8,700 కిలోమీటర్ల ప్రచండ వేగంతో చంద్రుడి పశ్చిమ అంచున ఉన్న 'ఐన్‌స్టీన్ క్రేటర్' సమీప ప్రాంతాన్ని ఢీకొట్టింది. ఈ ధాటికి చంద్రుడిపై కొత్తగా ఒక భారీ క్రేటర్ ఏర్పడింది. నాసా ప్రాథమిక అంచనాల ప్రకారం ఈ క్రేటర్ సుమారు 60 అడుగుల వెడల్పు, 12 అడుగుల లోతుతో ఉంది. ఈ ఘటనలో చంద్రుడి ఉపరితలంపై ఉన్న ధూళి, రాళ్లు పెద్ద ఎత్తున గాల్లోకి ఎగిరిపడ్డాయి.

ఈ విలక్షణ అంతరిక్ష ఘట్టాన్ని పరిశోధకులు ఆసక్తిగా గమనించారు. యూరోపియన్ సదరన్ అబ్జర్వేటరీ టెలిస్కోప్ ద్వారా శాస్త్రవేత్తలు ఢీకొన్న ప్రాంతంలో సోడియం, లిథియం వాయువుల సంకేతాలను గుర్తించగా, దక్షిణ కొరియాకు చెందిన 'డానురి లూనర్ ఆర్బిటర్' ఈ కొత్త క్రేటర్ యొక్క ఫోటోలను స్పష్టంగా చిత్రీకరించింది. ఈ ఘటన వల్ల భూమికి ఎలాంటి ప్రమాదం కలగలేదని, గతంలో కూడా ఇలాంటి అనుకోని రాకెట్ భాగాలు చంద్రుడిని ఢీకొట్టిన సంఘటనలు నమోదయ్యాయని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

## త్వరలో డిజిటల్ అసెంబ్లీ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

గ్రామీణ ప్రాంతాల సాధికారత లక్ష్యంగా టీ–ఫైబర్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 80 లక్షలకు పైగా గ్రామీణ కుటుంబాలకు హైస్పీడ్ డిజిటల్ కనెక్టివిటీని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు ఎలాంటి శ్రమ లేకుండా ప్రభుత్వ పౌర సేవలను నేరుగా వారి ఇంటి ముంగిటకే చేరవేసే వ్యవస్థను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. పాలనా వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. దాదాపు 20కి పైగా ప్రధాన ప్రభుత్వ శాఖలను ఒకే వేదికపైకి తెచ్చి, పథకాల అమలును నిరంతరం పర్యవేక్షించేందుకు రియల్ టైమ్ గవర్నమెంట్ డ్యాష్ బోర్డును రూపొందిస్తున్నట్లు మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర సీఎంవో చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ ప్రవీణ్ పరదేశి, సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఎండీ జీవీఎల్ సత్య కుమార్, నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా సీఈవో డాక్టర్ దేవేష్ త్యాగి, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ అడిషనల్ సెక్రటరీ సౌరభ్ కె.తివారీలతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సునేత్రా-పీకే భేటీ కలకలం

మొదటి పేజీ తరువాయి

అయితే, ఈ సమావేశంలో ఏం చర్చించారనే వివరాలను మాత్రం ఎన్సీపీ నేత వెల్లడించారు. ఈ ఏడాది జనవరిలో బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణించిన తర్వాత ఆయన సతీమణి సునేత్రా పవార్‌తో పీకే భేటీ కావడం ఇది రెండోసారి. కొద్ది నెలల కిందట వీరిద్దరి మధ్య మొదటి భేటీ జరిగినప్పుడు, ప్రశాంత్ కిశోర్ తమ కుటుంబానికి పరిచయస్థుడేనని ఆమె కుమారుడు, ఎన్సీపీ నేత పార్థ్ పవార్ వెల్లడించిన విషయం తెలిసిందే.

బీజేపీ కోటలో ప్రశాంత్ కిషోర్ పాగా.. కాషాయ పార్టీకి షాక్

పార్టీ బలోపేతం సలహాలు

అయితే, పార్టీ సంస్థాగత పునర్నిర్మాణంపై కిషోర్ సలహాలు ఇచ్చినట్టు ఎన్సీపీ అధికార ప్రతినిధి సూరజ్ చవాన్ తెలిపారు. ఈ భేటీకి అధ్యక్షురాలు సునేత్రా పవార్, ఆమె కుమారుడు పార్థ్ పవార్, సీనియర్ నాయకులు హాజరయ్యారని పేర్కొన్నారు. "పార్టీని ఎలా బలోపేతం చేయాలి, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్రస్థాయికి చేరేలా ఎలా చూడాలి అనే విషయాలపై చర్చించడానికి ఇది ఒక అంతర్గత సమావేశం" అని ఆయన అన్నారు. ఎన్సీపీ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ తట్కరే పనితీరుపై కిషోర్ అసంతృప్తి వ్యక్తం చేశారని, ఆయనను తొలగించాలని కోరారన్న ఊహాగానాలను చవాన్ తోసిపుచ్చారు. ఇదే విషయాన్ని ఎన్సీపీ మంత్రి నరహరి జివారీ సైతం ఖండించారు.

మహారాష్ట్ర బీజేపీ నేతలు కూటమిలో చీలిక రాకుండా హెచ్చరించడం గురించి మీ అభిప్రాయమేమిటి? ఈ వ్యాఖ్యలు రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయని మీరు అనుకుంటున్నారు? మీ అభిప్రాయాలను కామెంట్ బాక్స్‌లో తెలియజేయండి.

## దస్తావేజులు నకిలీ... దందా అసలైనది!

మొదటి పేజీ తరువాయి

సదరు డీఐఈఓలు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేయకుండా నకిలీ ఎన్వోసీలు సృష్టించిన వ్యవహారంలో అంతా తామే చూసుకుంటామని ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు భరోసా ఇస్తున్నారు. కొన్నేళ్లుగా బదిలీ చేయకుండా ఇంటర్ బోర్డు కార్యాలయంలో తిష్టవేసిన అధికారులు ఈ తతంగంలో చురుగ్గా వ్యవహరిస్తున్నారని తెలుస్తున్నది. ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఒక జేఏస్ స్థాయి ఆఫీసర్, సదరు అధికారికి ఇద్దరు సూపరిండెంట్ స్థాయి అధికారులు సహకరిస్తూ అఫ్లియేషన్ల విషయంలో భారీఎత్తున ప్రైవేట్ కాలేజీల నుంచి ముడుపులు అందుకుంటున్నట్టు సీఎంవో స్థాయి అధికారుల్లో సైతం జోరుగా చర్చ నడుస్తున్నది.

జీహెచ్ఎంసీ పేరుతో నకిలీ ఎన్వోసీలు

రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం హైడ్రాను ఏర్పాటు చేసింది. అప్పటివరకు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న అగ్నిమాపక విభాగాన్ని అందులో విలీనం చేశారు. అంతకుముందు జీహెచ్ఎంసీ పరిధిలోని అగ్నిమాపక విభాగం కాలేజీలకు ఫైర్ ఎన్వోసీలు జారీ చేయగా, విలీనం తర్వాత హైడ్రా పరిధిలోకి వెళ్లింది. కానీ కాలేజీలు రెండేళ్లుగా జీహెచ్ఎంసీ పేరుతో ఫైర్ ఎన్వోసీలు సమర్పించడం, అధికారులు ఎక్కడా అభ్యంతరం వ్యక్తం చెప్పకపోవడం గమనార్హం. హైదరాబాద్ మెహిదీపట్నంలోని హిదాయత్ జూనియర్ కాలేజీకి జీహెచ్ఎంసీ పేరిట 2025లో ఎన్వోసీ ఇవ్వడం గమనార్హం. ఆ కాలేజీ భవనం ఎత్తు 14.95 మీటర్లు ఉంది. కాలేజీ భవనం ఎత్తు 15 మీటర్ల లోపు ఉంటే హైడ్రా, ఆపై దాటితే అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ ఎన్వోసీ జారీచేయాల్సి ఉంటుంది. కానీ ఆ కాలేజీ ఫైర్ ఎన్వోసీలో జీహెచ్ఎంసీ కమిషనర్ పర్మిషన్ ఇచ్చినట్టు ఉంది. ఈ తతంగాన్ని పరిశీలిస్తే ఫేక్ ఎన్వోసీల విషయంలో ఇంటర్ బోర్డు అధికారులు ఎంత దందా నడిపిస్తున్నారో స్పష్టమవుతున్నది.

నకిలీ ఫైర్ ఎన్వోసీలు సమర్పించిన కాలేజీలు

1. బాబుల్ రెడ్డి జూనియర్ కాలేజీ, ఎర్రగడ్డ మెయిన్ రోడ్, 2.న్యూ శ్రీచైతన్య జూనియర్ కాలేజీ, టోలిచౌకి, 3.ఎస్ఎం అలీస్ శాంతినికేతన్ జూనియర్ కాలేజీ, మెహదీపట్నం, 4.శ్రీ అక్షర జూనియర్ కాలేజీ, అమీర్‌పేట, 5.అచీవర్స్ జూనియర్ కాలేజీ, టోలిచౌకి, 6.హిదాయా జూనియర్ కాలేజీ, ఆసిఫ్ నగర్, 7.జునైద్ జూనియర్ కాలేజీ, హుమాయూన్ నగర్, 8.సెయింట్ పాట్రిక్స్ ఆల్టిట్యూడ్ జూనియర్ కాలేజీ, నల్లకుంట, 9.ఫిట్జీ జూనియర్ కాలేజీ, నారాయణగూడ, 10.శ్రీవాణి జూనియర్ కాలేజీ ఫర్ గర్ల్స్, మలక్‌పేట, 11.ఎస్ వీ జూనియర్ కాలేజీ ఆఫ్ కామర్స్, చంపాపేట, 12.శ్రీ శ్రీనివాస జూనియర్ కాలేజీ, సంతోష్ నగర్, 13.విజనరీ జూనియర్ కాలేజీ, గౌజీపురా, 14.ముషీరాబాద్ జూనియర్ కాలేజీ గర్ల్స్, జమిస్తాన్‌పూర్, 15.సరోజినీనాయుడు జూనియర్ కాలేజీ ఫర్ గర్ల్స్, చిక్కడపల్లి, 16.విజనరీ జూనియర్ కాలేజీ, షాఅలీబండా, 17.లైఫ్ లైన్ ఒకేషనల్ జూనియర్ కాలేజీ, చార్మినార్, 18.నానో జూనియర్ కాలేజీ, నల్లకుంట, 19.ఆద్య జూనియర్ కాలేజీ, దిల్ సుఖ్ నగర్, 20.హిదాయా జూనియర్ కాలేజీ, కొత్త సంతోష్ నగర్ కాలనీ, 21.ఐఏసీజీ ఒకేషనల్ జూనియర్ కాలేజీ, మూసారాంబాగ్, 22.శ్రీసాయి చైతన్య జూనియర్ కాలేజీ, సికింద్రాబాద్, 23.సింధు జూనియర్ కాలేజీ ఫర్ గర్ల్స్, రేతిబౌలి, 24.మాస్టర్స్ జూనియర్ కాలేజీ, యూసుఫ్ గూడ చెక్ పోస్ట్, 25.శ్రీ వెంకట పద్మావతి జూనియర్ కాలేజీ, బోరబండ, 26.సెయింట్ ఫ్రాన్సిస్ జూనియర్ కాలేజీ, బేగంబజార్, 27.విదిశ జూనియర్ కాలేజీ, తిరుమలగిరి, 28.శ్రీ మేధా జూనియర్ కాలేజీ, అత్తాపూర్, 29.ఎక్సలెన్సియా జూనియర్ కాలేజీ, మదీనాగూడ, 30.విశ్వభారతి జూనియర్ కాలేజీ, హైదర్‌షాకోట్, 31.వికాస్ జూనియర్ కాలేజీ, వనస్థలిపురం, 32.శ్రీ తపస్య జూనియర్ కాలేజీ, బండ్లగూడ జాగీర్, 33. జ్ఞానదీపిక జూనియర్ కాలేజీ, మాదాపూర్, 34. భార్గవ జూనియర్ కాలేజీ, బైరామల్ గూడ, 35.విజ్ఞాన భారతి జూనియర్ కాలేజీ, యాప్రాల్, 36.శ్రీ అభ్యాస జూనియర్ కాలేజీ, అల్వాల్, 37.సీఎంఎస్ కామర్స్ జూనియర్ కాలేజీ, ఈసీఐఎల్, 38.ఎక్సలెన్సియా జూనియర్ కాలేజీ, పేట్ బషీరాబాద్, 39.శ్రీ నారాయణ కాలేజీ ఆఫ్ కామర్స్, ఉప్పల్, 40.ఎక్సలెన్సియా జూనియర్ కాలేజీ, దమ్మాయిగూడ, 41.శ్రీ చైతన్యభారతి జూనియర్ కాలేజీ, చందానగర్, 42.ఇక్బాలియా జూనియర్ కాలేజీ, అత్తాపూర్, 43.కైట్స్ జూనియర్ కాలేజీ, ఓల్డ్ బోయిన్‌పల్లి, 44. కెరీర్ పాయింట్ జూనియర్ కాలేజీ, పేట్ బషీరాబాద్ నకిలీ ఫైర్ ఎన్వోసీలు సమర్పించాయి.

బోర్డు కార్యదర్శి ఏమన్నారంటే..?

ఈ వ్యవహారంపై ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ స్పందిస్తూ.. నకిలీ ఫైర్ ఎన్వోసీల వ్యవహారంపై సమగ్ర విచారణ జరుపుతామని వెల్లడించారు. ఇతర ప్రభుత్వ శాఖల బోర్డు పూర్తి సమన్వయంతో పనిచేస్తోందన్నారు. నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలిన కాలేజీలపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వివిధ కాలేజీలు సమర్పించిన ఫైర్ ఎన్ఓసీల ప్రామాణికత, నిజానిజాలను క్షుణ్ణంగా తేల్చేందుకు ఇప్పటికే అంతర్గత విచారణను ప్రారంభించినట్టు పేర్కొన్నారు.

## ఉగ్రకుట్ర కేసులో ప్రకంపనలు



**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (తెలుగు గళం):** జంతర్ మంతర్ నిరసనలపై అమృత్‌సర్ పోలీస్ కమిషనర్ గుర్‌ప్రీత్ సింగ్ భుల్లార్ చేసిన వ్యాఖ్యలు పంజాబ్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇప్పుడు భుల్లార్‌ను ఆమ్ ఆద్మీ పార్టీ సర్కార్ బదిలీ చేసింది. దీనిపై బీజేపీ ప్రశ్నల్ని లేవనెత్తింది. కొద్దిరోజుల క్రితం అమృత్‌సర్ పోలీసులు పాకిస్తాన్ ఐఎస్ఐ మద్దతుతో పనిచేస్తున్న ఉగ్రవాద మాడ్యుళ్లపై కీలక ఆపరేషన్ నిర్వహించారు. ఈ కేసులో నలుగురు మైనర్లతో పాటు మొత్తం తొమ్మిది మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మూడు పిస్టళ్లు, తొమ్మిది లైవ్ కార్ట్రిడ్జ్‌లు, నాలుగు పెట్రోల్ బాంబులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు భద్రతా కేంద్రాలపై నిఘా నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ నేపథ్యంలో కమిషనర్ గుర్‌ప్రీత్ సింగ్ భుల్లార్ మాట్లాడుతూ.. అరెస్టైన నిందితులు ఢిల్లీలోని జంతర్ మంతర్‌కు వెళ్లి అక్కడ రెక్కీ నిర్వహించారని, నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనల్లో నిరసనకారులపై పెట్రోల్ బాంబులతో దాడి చేసే కుట్ర పన్నినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా కూడా సంచలనంగా మారాయి.

ఇప్పుడు, ఈ వ్యాఖ్యలపై పంజాబ్ ప్రభుత్వం స్పందించింది. ఆయన వ్యాఖ్యల్ని తప్పుగా అర్థమయ్యేలా ఎంపిక చేసిన భాగాలను మాత్రమే ప్రచారం చేశారని ప్రభుత్వం స్పష్టం చేసింది. అరెస్టైన వ్యక్తులు జంతర్ మంతర్ నిరసనల్లో పాల్గొన్నారని లేదా నిరసనకారులకు ఉగ్రవాద మాడ్యుళ్లతో సంబంధం ఉందని కమిషనర్ ఎక్కడా చెప్పలేదని స్పష్టతనిచ్చింది.

ఈ వివాదం తర్వాత భుల్లార్‌ను బదిలీ చేయడంపై రాజకీయ చర్చ మొదలైంది. ఈ బదిలీకి జంతర్ మంతర్ వ్యాఖ్యలే కారణమని బీజేపీ ఆరోపిస్తోంది. మాజీ కేంద్ర మంత్రి, బీజేపీ నేత రవ్‌నీత్ సింగ్ బిట్టూ ఈ బదిలీపై అనుమానం వ్యక్తం చేశారు. ఆయనను బదిలీ చేసిన సమయంపై అనేక సందేహాలు ఉన్నాయని అన్నారు. జంతర్ మంతర్ కుట్రపై ఆయన చేసిన వ్యాఖ్యలు అరవింద్ కేజ్రీవాల్‌కు అసౌకర్యంగా మారాయా? అని ప్రశ్నించారు.

## బోనాల పండుగ వేళ గుడ్‌న్యూస్: వరుసగా మూడ్రోజులు సెలవులు



**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (తెలుగు గళం):** తెలంగాణలోని పాఠశాలలు, కళాశాలలకు ఈ వారాంతంలో (వీకెండ్) వరుసగా మూడు రోజుల పాటు వరుస సెలవులు రానున్నాయి. ఈ నెల (ఆగస్టు)లో పండుగలు, సాధారణ సెలవుల కారణంగా విద్యాసంస్థలు సుదీర్ఘ హాలీడేస్ రాబోతున్నాయి. ఆగస్టు 08న రెండో శనివారం సెలవు, ఆగస్టు 09న ఆదివారం, ఆగస్టు 10న సోమవారం బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలకు అధికారిక సెలవు ప్రకటించింది. శని, ఆది, సోమవారాలు ఒకేసారి కలిసి రావడంతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు "లాంగ్ వీకెండ్" లభించనుంది. ఈ ఆగస్ట్ నెలలో ఆదివారాలు, రెండో శనివారం, స్వాతంత్ర్య దినోత్సవం, బోనాలు తదితర పండుగలు, వరుస వేడుకల కారణాల వల్ల విద్యాసంస్థలకు మొత్తం 11 రోజుల పాటు సెలవులు లభించనున్నాయి. వరుస సెలవుల నేపథ్యంలో పలు కుటుంబాలు బోనాల ఉత్సవాల్లో పాల్గొనడానికి, స్వగ్రామాలకు ప్రయాణమయ్యేందుకు సిద్ధమవుతున్నాయి.

# తల్లిపాలే శిశువుకు తొలి టీకా"

**• సర్పంచ్ ఫక్రుద్దీన్ కు పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికిన అంగన్వాడీలు" • వేంసూరు,మర్లపాడులో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాలు" పాల్గొన్న సర్పంచ్ లు"**



సత్తుపల్లి/వేంసూరు,ఆగస్టు 07(తెలుగుగళం) న్యూస్: జాతీయ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండల కేంద్రంలో మరియు మర్లపాడు గ్రామంలో నాలుగో అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు సూపర్ వైజర్ కమల అవగాహన కల్పించారు.ముర్రుపాలే శిశువుకు తొలి టీకా అని, పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఇతర ఆహార పదార్థాలు అందించరాదని వివరించారు. తల్లిపాలు శిశువు ఎదుగుదలతో పాటు రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.



అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న వేంసూరు సర్పంచ్ మహమ్మద్ ఫక్రుద్దీన్ కు అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికారు.ఫక్రుద్దీన్ ,వార్డు సభ్యుడు వెంకటరమణ చేతుల మీదుగా చిన్నారులకు అన్నప్రాసన వేడుక నిర్వహించారు. మర్లపాడు గ్రామంలో సర్పంచ్ కనమాల ఆంధ్రయ్య ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో: ఏఎన్ఎం సరోజిని, ఆశా కార్యకర్త మేరీ, వార్డు సభ్యురాలు పూరేటి మరియమ్మ, కనమాల సీతమ్మ, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు స్వర్ణ, శాంతామణి, రాజ్యలక్ష్మి, పుష్ప, ఎస్. లక్ష్మి, జయ, జయమ్మ, సద్గుణ, హెల్పర్ ఆయమ్మ, అంగన్‌వాడీ ఆయాలు, గ్రామ పెద్దలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాలకుర్తిలో ఆగస్టు 16న బోనాల పండుగ



తెలుగు గళం న్యూస్
పాలకుర్తి, ఆగస్టు 7

జనగామ జిల్లా, పాలకుర్తి మండల కేంద్రంలో ఈ నెల 16న బోనాల పండుగను ఘనంగా నిర్వహించాలని గ్రామ పెద్దలు, ప్రముఖ వేదపండితుల సూచనల మేరకు నిర్ణయించారు.ఈ మేరకు శుక్రవారం సమావేశం నిర్వహించి పండుగ ఏర్పాట్లపై చర్చించారు.ఈ సమావేశంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.బోనాల పండుగను సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. అలాగే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల పండుగను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# కూసంపూడి మహేష్ జన్మదినం సందర్భంగా ఉచిత అల్పాహార పంపిణీ"



సత్తుపల్లి,ఆర్ సి,ఆగస్టు07 (తెలుగుగళం) న్యూస్: సత్తుపల్లి పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్, సత్తుపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు కూసంపూడి మహేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు చాంద్ పాషా, అద్దంకి అనిల్, వల్లభనేని పవన్,పర్వతనేని వేణు ల ఆధ్వర్యంలో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద, ప్రధాన రోడ్డులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రోగులు, వారి సహాయకులు, ప్రజలకు ఉచిత అల్పాహారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూసంపూడి మహేష్ సేవా దృక్పథాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. మహేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మిద్దె శ్రీను, షేక్ బాబు, అప్పు, లయన్స్ క్లబ్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆగస్టు 10న చలో సత్తుపల్లి విజయవంతం చేయండి: జాజిరి శ్రీనివాస్"



సత్తుపల్లి,ఆర్ సి,ఆగస్టు07 (తెలుగుగళం) న్యూస్ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న నిర్వహించే దేశవ్యాప్త జైల్ భరో కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి తహసీల్దార్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

శుక్రవారం సత్తుపల్లి ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని, అన్ని పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర అమలు చేయాలని, ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 రోజుల పని, రోజుకు రూ.800 వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు.

సమావేశంలో జాజిరి జ్యోతి, కావూరి వెంకటేశ్వరరావు, కావ్వారపు లక్ష్మణరావు, బండి వేలాద్రి, ఎలగం రాములు తదితరులు పాల్గొన్నారు.

# శంభునిగూడెం లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు"

**పాల్గొన్న సర్పంచ్,ఉప సర్పంచ్"**
**తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ: ఇజ్జిగాని గంగాజలం(బీరాపల్లి సెక్టార్ సూపర్ వైజర్)**



సత్తుపల్లి/వేంసూరు,ఆగస్టు 07 (తెలుగుగళం) న్యూస్: నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలో గల శంభునిగూడెం గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ప్రదర్శన బీరాపల్లి సెక్టార్ సూపర్ వైజర్ ఇజ్జిగాని గంగాజలం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగింది. తల్లిపాలే పుట్టిన శిశువుకు తొలి రక్షణ అని గంగాజలం గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించారు.గ్రామ సర్పంచ్ అరవపల్లి నరసింహారావు, ఉప సర్పంచ్ నాగేంద్రబాబు లు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. శిశువుల ఆరోగ్యానికి తల్లిపాలు ఎంత ముఖ్యమో వివరించారు.చిన్నారులకుఅన్నప్రాసనలు చేశారు. తల్లిపాల ప్రయోజనాలు, చిన్నారుల సంరక్షణ, సమతుల్య పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవన విధానంపై మహిళలకు గంగాజలం అవగాహన కల్పించారు. అనంతరం ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహించి, పోషకాహారంపై సందేహాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో: హెల్త్ సూపర్వైజర్ ఫాతిమా బేగం,పంచాయతీ కార్యదర్శి స్వాతి, అంగన్‌వాడీ టీచర్లు రాహేలు,కరుణ,రజిత, ఇందిర,ఆశా కార్యకర్త పుల్లమ్మతో పాటు గ్రామ మహిళలు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రవాణా సౌకర్యం, టీచర్స్ లేక విద్యార్థులకు ఇబ్బందులు



గట్టు,తెలుగు గళం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జోగులాంబ గద్వాల జిల్లా గట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పోస్టుకార్డుల ద్వారా వినతిపత్రాలు పంపారు. కళాశాలలో మొత్తం 340 మంది విద్యార్థులు చదువుతుండగా.. సల్కాపురం, గంగమాందొడ్డి, మాచర్ల, బలిగేరా, తప్పెట్లమోరుసు, చింతలకుంట, అరగిద్ద సహా చుట్టుపక్కల 17 గ్రామాల నుంచి 239 మంది విద్యార్థులు రోజూ రాకపోకలు సాగిస్తున్నారు. సరైన రవాణా (బస్సు) సౌకర్యం లేకపోవడంతో కిలోమీటర్ల కొద్దీ నడుచుకుంటూ రావాల్సి వస్తోందని, దీనివల్ల ముఖ్యంగా బాలికలు చదువుకు దూరమై బాల్యవివాహాల బారిన పడుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు.? దీనికితోడు కళాశాలలో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు, ముఖ్యంగా సైన్స్ ఉపాధ్యాయులు లేక చదువు దెబ్బతింటోందని తెలిపారు. న్యాయమూర్తి స్పందించి రవాణా సౌకర్యంతో పాటు సైన్స్ అధ్యాపకులను నియమించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు వేడుకున్నారు.

# ఆగస్టు 10 న జైల్ బరో" రహదారుల దిగ్బంధనాలు"

**• యువతను గాయపరిచినప్పుడు రాని కన్నీరు నేడు వస్తుందా పవన్? • చట్టాన్ని పథకంగా మార్చి కూలీల కడుపు కొడుతున్న మోదీ ప్రభుత్వం: మాచర్ల భారతి(సీపీఎం రాష్ట్ర కమిటి సభ్యురాలు) • సామ్రాజ్యవాద కార్పొరేట్ వ్యవసాయశీ ఇండియాలో: శీలం సత్యనారాయణరెడ్డి(సీపీఎం డివిజన్ కార్యదర్శి) • లేబర్ కోడ్లు కార్మికవర్గానికి ఉరి: చలమాల విఠల్ రావు(సీఐటీయూ రాష్ట్ర కమిటి సభ్యులు)**



సత్తుపల్లి,ఆర్ సి,ఆగస్టు07(తెలుగుగళం) న్యూస్: ఆగస్టు 10 న దేశ వ్యాప్తంగా మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై,క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో సీపీఎం అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన జైల్ బరో కార్యక్రమ జయప్రదం కోరుతూ శుక్రవారం సత్తుపల్లి పట్టణంలోని రావి వీరవెంకయ్య భవనంలో జరిగిన నియోజకవర్గ ప్రజాసంఘాల నేతల సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కమిటి సభ్యురాలు మాచర్ల భారతి మాట్లాడుతూ నాడు పల్లెల నుండి వలసలు అరికట్టి పల్లె పేదలకు పొట్ట నింపే దానికి పోరాడి సాధించిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ చట్టాన్ని నేటి కేంద్ర బిజెపి మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తూ జాతిపిత గాంధీ పేరును తొలగించి గాంధీని చంపిన గాడ్సే పేరు కలుపుతూ వి.బి.జి.రామ్ జీ గా మార్చి చట్టాన్ని పథకంగా మార్చి నిధుల కేటాయింపులో కోత విధించి కూలీల పొట్ట కొడుతుందని గ్రామీణ ప్రాంతాల వ్యవసాయ కార్మికులు ఆగస్టు 10 న జరగనున్న జైల్ బరో కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.అంతే కాకుండా ఇటీవల నీట్ పరీక్షా ఫలితాల పేపర్ లీక్ పై పోరాడిన యువతను,విద్యార్థులను మోడీ సర్కారు కొట్టించి గాయపరిచిన సందర్భంలో నీకు రాని కన్నీరు నేడు ఎలా వస్తుంది పవన్ కళ్యాణ్ గారు అని ప్రశ్నించారు.

అనంతరం సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాద కార్పొరేట్ వ్యవసాయాన్ని ఇండియా లో మోడీ సర్కారు అమలు పరిచి దేశాన్ని తాకట్టు పెట్టే కుట్ర చేస్తుందని అమెరికా విత్తనాలు నాటాలని,వచ్చిన ఉత్పత్తులను తిరిగి అమెరికా నిర్ణయించిన ధరకు అమెరికా కొనుగోలు కేంద్రాలకే విక్రయించేలా మోడీ సర్కారు ఒప్పందాలు చేసుకుంటుందని భారత వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి ఆగస్టు 10 న జరగనున్న జైల్ బరో కార్యక్రమంలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం సీఐటీయూ రాష్ట్ర కమిటి సభ్యులు చలమాల విఠల్ రావు మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గ శ్రేయస్సు కోసం పోరాటాలతో ఏర్పడిన 44 కార్మిక చట్టాలను నేటి మోడీ ప్రభుత్వం 04 లేబర్ కోడ్లగా మార్చి యాజమాన్యాలకు అనుకూలంగా కార్మికులకు వ్యతిరేకంగా మార్పులు చేసిందన్నారు.సంఘం పెట్టుకున్నే హక్కు లేకుండా సమ్మె చేసే హక్కు లేకుండా,అంతర్జాతీయ స్థాయిలో అమలవుతున్న 08 గంటల పని విధానాన్ని భారత్ లో 12 గంటలకు మార్చే కుట్ర చేస్తుందని వాటిని వ్యతిరేకిస్తూ ఆగస్టు 10 న జరగనున్న జైల్ బరో కార్యక్రమాలలో కార్మికులు,ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొనాలని రహదారుల దిగ్బంధనాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో: సీపీఎం జిల్లా కమిటి సభ్యులు మోరంపూడి పాండు రంగారావు,జాజిరి శ్రీనివాస్,డివిజన్ కమిటీ సభ్యులు కొలికపోగు సర్వేశ్వరరావు,రావుల రాజబాబు, అయినాల రామలింగేశ్వరరావు,జాజిరి జ్యోతి,తన్నీరు కృష్ణార్జునరావు,సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# శంకరాజుపల్లి ఎంపీయూపీఎస్ పాఠశాలలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించిన ఉపాధ్యాయులు**

తెలుగు గళం
ఏటూరునాగారం:



ఏటూరు నాగారం మండలం శంకరాజుపల్లి ఎంపీయూపీఎస్ పాఠశాలలో తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు అత్యంత భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల సంప్రదాయ దుస్తులు ధరించి బోనం ఎత్తుకుని ఊరేగింపుగా పాల్గొని పాఠశాల ప్రాంగణాన్ని పండుగ వాతావరణంతో కళకళలాడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోనాల పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, ఆచార వ్యవహారాలు, అమ్మవారి ఆరాధన ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సంప్రదాయాల పట్ల గౌరవం, సంస్కృతిపై అవగాహన, సామాజిక విలువలు పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఉపాధ్యాయులు స్రవంతి, సమత, సరిత, భాగ్యవతి, విజయలక్ష్మి, రవీందర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థుల ఉత్సాహభరిత పాల్గొనికతో పాఠశాలలో బోనాల వేడుకలు విజయవంతంగా ముగిశాయి.



# జర్నలిస్టు బస్ పాస్ చెల్లదట!

**పాస్ చూపించినా రూ.90 టికెట్ కొట్టిన కండక్టర్**

తెలుగు గళం న్యూస్ మంచిర్యాల ఆగస్టు 07

జర్నలిస్టులకు ప్రభుత్వం జారీ చేసిన బస్ పాస్‌లకు ఆర్టీసీలో విలువ లేకుండా పోయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.శుక్రవారం కాగజ్‌నగర్ నుంచి మంచిర్యాలకు వస్తున్న కోరుట్ల డిపోకు చెందిన టిఎస్22 టి 5559 బస్సులో ఈ ఘటన చోటుచేసుకుంది.అక్రిడిటేషన్ కార్డుతో పాటు ఆర్టీసీ జారీ చేసిన జర్నలిస్టు బస్ పాస్‌ను సదరు విలేకరి కండక్టర్‌కు చూపించారు. అయితే పాస్ చెల్లదని, అది డూప్లికేట్ పాస్ అంటూ టికెట్ తీసుకోవాలని కండక్టర్ చెప్పినట్లు జర్నలిస్టు తెలిపారు.దీంతో రూ.90 చెల్లించి టికెట్ తీసుకోవాల్సి వచ్చింది.

పాస్‌పై 22-06-2026 నుంచి 30-04-2028 వరకు చెల్లుబాటు ఉన్నట్లు స్పష్టంగా ఉన్నప్పటికీ కండక్టర్ తిరస్కరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇది ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యమా.. సిబ్బందికి అవగాహన లేకపోవడమా.. లేక కండక్టర్ అత్యుత్సాహమా అని జర్నలిస్టులు ప్రశ్నిస్తున్నారు. ఘటనపై ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

# పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రజాపాలన ధ్యేయం: ఎమ్మెల్యే



సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సొంతింటి కల నెరవేరుతోందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గట్టు మండలం ఆలూరు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. లబ్ధిదారుడు మహమ్మద్ కుటుంబ సభ్యులకు కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ పథకం కింద విడతల వారీగా రూ.5 లక్షలు అందిస్తోందన్నారు. గద్వాల నియోజకవర్గంలో మొదటి విడతలో 3,500 ఇళ్లు మంజూరయ్యాయని, అర్హులైన మిగతా వారికి రెండో విడతలో ఇళ్లు మంజూరు చేస్తామని, నిధులపై అపోహలు వద్దని స్పష్టం చేశారు. అనంతరం లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల గుడిసెలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలి-సీపీఎం డిమాండ్

## కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలని నాగయ్య పిలుపు

**తెలుగు గళం న్యూస్ వరంగల్, ఆగస్టు 7**

వరంగల్ నగరంలో ప్రభుత్వ స్థలాల్లో గత మూడు దశాబ్దాలుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు వెంటనే ఇండ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం ఉర్సుగుట్టలోని సీపీఎం జిల్లా కార్యాలయం రామ సురేందర్ భవన్‌లో వరంగల్ టౌన్ పార్టీ శాఖ కార్యదర్శుల సమావేశం జిల్లా నాయకుడు సింగారపు బాబు అధ్యక్షతన జరిగింది.సమావేశంలో పాల్గొన్న నాగయ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు పేదలకు ఇండ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయడం లేదని విమర్శించారు.సుందరయ్య నగర్, కారల్ మార్క్స్ నగర్, ఎన్‌పీఆర్ నగర్, ఓఎస్ నగర్, రఘునాథ్ నగర్, డీకే నగర్, మల్లు స్వరాజ్యం నగర్, జక్కలొద్ది, లెనిన్ నగర్, మైసయ్య నగర్, బీరన్నకుంట తదితర ప్రాంతాల్లో వేలాది మంది పేదలు ఇండ్ల పట్టాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు.వరంగల్ నగరంలోని కార్పొరేషన్ డివిజన్లలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై సర్వేలు నిర్వహిస్తున్నామని, మంచినీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పెన్షన్లు, రేషన్ కార్డులు, స్మశానవాటికల వంటి అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే వీటిని పరిష్కరించాలని, లేకపోతే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఈసంపల్లి బాబు,




నళిగంటి రత్నమాల, ఆరూరి కుమార్, వలదాసు దుర్గయ్య, యారా ప్రశాంత్, బషీర్, ఉసిల్ల కుమార్‌తో పాటు శాఖ కార్యదర్శులు శ్రీనివాస్, రమ్య, కవిత, కళ్యాణి, రవి, భవాని, భాగ్య తదితరులు పాల్గొన్నారు

# ఈ నెల 10 న జైల్ బరో జయప్రదం చేయండి

## : రావుల రాజబాబు(సీపీఎం డివిజన్ నేత)



**సత్తుపల్లి/ వేంసూరు, ఆగస్టు07 (తెలుగుగళం) న్యూస్:** ఆగస్టు10 న కార్మిక,కర్షక,కూలీల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం అనుబంధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న జైల్ బరో కార్యక్రమంలో రాజకీయాలతీతంగా పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం సత్తుపల్లి డివిజన్ నాయకుడు రావుల రాజబాబు పిలుపునిచ్చారు.శుక్రవారం మండల పరిధిలోని లింగపాలెం గ్రామంలో జరిగిన సీపీఎం గ్రామశాఖ సమావేశంలో పాల్గొన్న రావుల మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో: సీపీఎం సీనియర్ నాయకులు కొత్తా సత్యనారాయణ,గ్రామ శాఖా కార్యదర్శి కొత్తా అప్పారావు,రాయల చెన్నారావు,సుజాత,బేతిని చెన్నారావు,రావుల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10 న మర్లపాడులో రహదారుల దిగ్బంధనం”

- కదలిరండి కార్మిక,కర్షక, కూలీ మైత్రితో: మల్లూరు చంద్రశేఖర్(సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి)
- కార్పోరేట్ సంస్థలకు దోచి పెట్టడమే మోడీ ప్రభుత్వం లక్ష్యం:అర్వపల్లి జగన్మోహన్ రావు(సీపీఎం మండల కార్యదర్శి)
- కరపత్రాలు విడుదల”పంపిణీ”

**సత్తుపల్లి/వేంసూరు,ఆగస్టు07(తెలుగు గళం) న్యూస్:** ఆగస్టు 10 న సీఐటీయూ,ఏ.ఐ. కె.ఎస్., ఏ.ఐ.ఏ.డబ్ల్యూ. యు. లు సంయుక్తంగా మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై క్విట్ ఇండియా ఉద్యమం చేపట్టిన ఆగస్టు 09 స్ఫూర్తితో ఆగస్టు 10 న ఇచ్చిన జైలు బరో కార్యక్రమం సందర్భంగా మండల పరిధిలోని మర్లపాడు గ్రామ సెంటర్ లో రహదారుల దిగ్బంధనం చేయనున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.శుక్రవారం సాయంత్రం మర్లపాడు గ్రామంలోని ఆల్ హమాలీ కార్మికుల అడ్డా వద్ద జరిగిన సభలో మల్లూరు మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరిస్తూ మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్లు తెచ్చిందని, దేశానికి అన్నం పెట్టే రైతన్నలను దగా చేస్తూ నూతన విద్యుత్ సంస్కరణలు తెచ్చి ద్రోహం చేస్తుందని,పల్లె పేదలకు కడుపు నింపడానికి తెచ్చిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ చట్టానికి గాంధీ పేరు తొలగించి గాంధీజీ నీ హతమార్చిన గాడ్సే పేరు కలుపుతూ వి.బి.జి.రామ్ జీ అని మార్చి చట్టాన్ని పథకంగా మార్చి నిధుల కేటాయింపు లేకుండా దుర్మార్గం చేస్తుందని దేశాన్ని, హక్కులను కాపాడుకోవడానికి కార్మికులు, కర్షకులు, కూలీలు మైత్రితో రాజకీయాలకతీతంగా 10 న పోరాటానికి కదిలిరావాలని పిలుపునిచ్చారు. జయప్రదం కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు.అనంతరం సీపీఎం మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్ రావు మాట్లాడుతూ దేశ ప్రజల హక్కులను కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టడమే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం పని చేస్తుందని



ఐక్య పోరాటాలతో తిప్పి కొట్టాలని,సీపీఎం అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో: గజ్జెల్లి సత్యనారాయణ, గజ్జెల్లి వెంకటేశ్వం ˊరావు, కనమాల నాగరాజు, దారా నాగరాజు, నడ్డి ప్రసాద్, నడ్డి వెంకటేశ్వరరావు,దారా శ్రీను, యామవరపు శ్రీను, పూరేటి శ్రీను,కనపర్తి కృష్ణ, వేము రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి జే.వి.ఆర్ ఓసి దుర్గ భవాని అమ్మ వారికి సారే సమర్పణ



**సత్తుపల్లి,ఆర్ సి,ఆగస్టు07(తెలుగుగళం) న్యూస్:** సత్తుపల్లి పట్టణం సింగరేణి జె.వి.ఆర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులోని శ్రీ శ్రీ శ్రీ దుర్గ భవాని అమ్మవారికి సింగరేణి పి.వి.ఎన్.ఆర్ కాలనీ మహిళలు ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారికి సారే సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో నిష్ట నియమాలతో పూజలు చేసి , పసుపు , కుంకుమ , గాజులు , పూలు , పండ్లు , పిండివంటలు , నూతన వస్త్రాలు సమర్పించారు. అనంతరం మహిళలందరూ కలిసి సామూహికంగా నైవేద్యం తయారుచేసి అమ్మవారికి అందజేసి భక్తులు ప్రసాదంగా స్వీకరించారు. అమ్మవారిని స్వయంగా ఇంటి ఆడబిడ్డలా సాకి , ప్రేమను చాటుకొని పవిత్ర సాంప్రదాయమే ఆషాడ మాస సారే అని మహిళలు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభ సంతరించుకోవడంతో అమ్మవారి నామస్మరణతో ప్రాంగణం మొత్తం మారు మోగింది. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి సింగరేణి కాలనీ మహిళ ఆడపడుచులు , సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

# పోడు భూముల్లో ఫారెస్ట్ ట్రెంచింగ్‌పై భగ్గుమన్న మల్యాల గ్రామస్థులు... జేసీబీలను అడ్డుకుని పనులు నిలిపివేత!

**ఎన్నేళ్లుగా సాగు చేస్తున్న భూముల్లో కందకాలు తవ్వొద్దు... ఫారెస్ట్ అధికారులను నిలదీసిన రైతులు, గ్రామస్థులు**
**పోడు భూముల పరిరక్షణ కోసం గ్రామస్థుల ఆందోళన... మల్యాలలో ఉద్రిక్తత, అధికారులతో వాగ్వాదం**





**తెలుగు గళం ఏటూరునాగారం, ములుగు :**

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం మల్యాల గ్రామంలో శుక్రవారం ఉదయం ఫారెస్ట్ శాఖ చేపట్టిన ట్రెంచింగ్ (కందకాలు) పనులను గ్రామస్థులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామ పరిసరాల్లో ఎన్నో సంవత్సరాలుగా పోడు వ్యవసాయం చేస్తున్న భూముల్లో ఫారెస్ట్ అధికారులు జేసీబీలతో కందకాలు తవ్వడం ప్రారంభించగా, భారీ సంఖ్యలో గ్రామస్థులు అక్కడికి చేరుకుని పనులను నిలిపివేశారు. తమ జీవనాధారమైన సాగు భూములను ధ్వంసం చేస్తూ ట్రెంచింగ్ పనులు చేపట్టడం అన్యాయమని గ్రామస్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా, స్థానికులతో చర్చించకుండా పనులు ప్రారంభించడం సరైంది కాదని అధికారులను నిలదీశారు. పోడు భూములపై తమ హక్కులను కాపాడుకునేందుకు అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని గ్రామస్థులు హెచ్చరించారు. ఘటనాస్థలంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, ఫారెస్ట్ అధికారులు గ్రామస్థులతో చర్చలు జరిపినట్లు సమాచారం. అయితే తమ సమస్యకు స్పష్టమైన హామీ లభించే వరకు ట్రెంచింగ్ పనులను అనుమతించబోమని గ్రామస్థులు స్పష్టం చేశారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారగా, అధికారులు తదుపరి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే అంశంపై ఆసక్తి నెలకొంది.

# కాంగ్రెస్ పార్టీ కి కొత్త సారథులు

## మండల, పట్టణ అధ్యక్షుల నియామకం

**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**





కాంగ్రెస్ పార్టీ నూతన మండల, పట్టణ అధ్యక్షుల పేర్లను శుక్రవారం విడుదల చేశారు. పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు,డీసీసీ అధ్యక్షురాలు డాక్టర్ భుక్యా ఉమా మురళి నాయక్ ఆమోదంతో డోర్నకల్ నియోజకవర్గంలోని పలు మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నియమించారు.డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే రామచంద్రనాయక్ నాయకత్వంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నూతనంగా నియమితులైన అధ్యక్షులు సమన్వయంతో పనిచేయాలని కాంగ్రెస్ శ్రేణులు ఆకాంక్షిస్తున్నారు. ఇందులో భాగంగా మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గుగులోత్ రవి నాయక్, మరిపెడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బానోత్ రామ్‌లాల్, చిన్నగూడూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎం. వెంకటేశ్వర్లు నియమితులయ్యారు.

నూతన అధ్యక్షులు గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని పార్టీ నాయకత్వం సూచించింది. నూతనంగా నియమితులైన నాయకులకు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

# మహబూబాబాద్ జిల్లాలో మరో ఫోర్జరీ కలకలం

- ఉప సర్పంచ్ సంతకం నకిలీ చేసిన సర్పంచ్ భర్త..?
- అధికారుల సమక్షంలో మళ్లీ అసలు సంతకం




**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్, ఆగస్టు 7**

మహబూబాబాద్ జిల్లాలో గ్రామ పంచాయతీల్లో ఫోర్జరీ ఆరోపణలు వరుసగా వెలుగుచూస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.ఇటీవల డోర్నకల్ పరిధిలోని గిరిపురం పంచాయతీలో నిధుల దుర్వినియోగం, గూడూరు మండలం గుండెంగ గ్రామంలో సర్పంచ్ కుమారుడు ఫోర్జరీ సంతకాలు చేసినట్లు వచ్చిన ఆరోపణలు చర్చనీయాంశంగా మారగా, తాజాగా కొత్తగూడ మండలం రామన్నగూడెం గ్రామపంచాయతీలో మరో ఫోర్జరీ ఘటన వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.గ్రామపంచాయతీకి సంబంధించిన ఒక కీలక రికార్డుపై ఉప సర్పంచ్‌కు తెలియకుండా ఆయన సంతకాన్ని సర్పంచ్ భర్త ఫోర్జరీ చేసి అధికారులకు సమర్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి.పత్రాలను పరిశీలించే సమయంలో సంతకాలపై అధికారులకు అనుమానం రావడంతో విషయం బయటపడినట్లు తెలుస్తోంది.ఈ విషయాన్ని తెలుసుకున్న ఉప సర్పంచ్ అధికారులను నిలదీయడంతో సర్పంచ్ భర్త వెనక్కి తగ్గినట్లు సమాచారం. అనంతరం కొత్తగూడ ఎంపీడీవో కార్యాలయంలో అధికారుల సమక్షంలో ఉప సర్పంచ్‌తో మళ్లీ అసలైన సంతకాలు చేయించినట్లు తెలిసింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది.ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యుల జోక్యం పెరగడం, ఫోర్జరీ ఆరోపణలు వరుసగా వెలుగుచూడడంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అయితే ఈ ఘటనపై అధికారుల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# పీఆర్సీ సమస్యల పరిష్కారానికి నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన”






**సత్తుపల్లి,ఆర్ సి,ఆగస్టు 07(తెలుగుగళం) న్యూస్:** యూఎస్‌పీసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సత్తుపల్లి మండలంలోని గంగారం, కాకర్లపల్లి ఉన్నత పాఠశాలలతో పాటు పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, జీవో–25ను సవరించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. పీఆర్సీ ప్రకటించే వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన









కార్యక్రమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.నిరసనలో పాల్గొన్న ఉపాధ్యాయులకు యూఎస్‌పీసీ సత్తుపల్లి భాగస్వామ్య సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్ ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# భర్తను హత్య చేయాలని ప్రియుడికి భార్య మెసేజ్‌లు?

- డోర్నకల్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు







**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్/డోర్నకల్, ఆగస్టు 7**

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన భార్య, ఆమెకు పరిచయం ఉన్న వ్యక్తిపై చేసిన ఫిర్యాదు స్థానికంగా చర్చనీయాంశమైంది.భర్తను హత్య చేయాలని ప్రియుడిని కోరుతూ భార్య వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సందేశాలు పంపినట్లు ఆరోపణలు వెలువడ్డాయి.చిలుకోడు గ్రామానికి చెందిన గాదే రాజేశ్వరరావుకు 2016లో సూర్యాపేట జిల్లాకు చెందిన భవానితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.అయితే తన భార్యకు సైదులు అనే కొరియర్ ఉద్యోగితో వివాహేతర సంబంధం ఉందని రాజేశ్వరరావు ఆరోపించారు.ఈ విషయం ఇటీవల తనకు తెలిసిందని, అనంతరం పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినట్లు తెలిపారు. ఆ తర్వాత తన అన్నను తీసుకురావడానికి వెళ్తున్న సమయంలో సైదులు తనను వెంబడించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.అనంతరం ఇంటికి వచ్చి భార్య మొబైల్ ఫోన్‌ను పరిశీలించగా, తనను ఎలాగైనా చంపాలని, లేదంటే తాను చనిపోతానని సైదులుకు పంపినట్లు చెబుతున్న వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ చాట్ సందేశాలు కనిపించాయని రాజేశ్వరరావు ఆరోపించారు.ఆ చాటింగ్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్లను సేకరించి భార్య భవాని, సైదులుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదుదారు గత పదేళ్లుగా ఖమ్మంలో నివసిస్తున్నారని, ఫిర్యాదులో పేర్కొన్న ఘటనలు ఖమ్మం పరిధిలో జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించిన పోలీసులు డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం కేసును విచారణ కోసం సంబంధిత పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు సమాచారం.ఈ ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆరోపణల నిజానిజాలు విచారణలో తేలాల్సి ఉంది.


Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.